# నిర్లక్ష్యం చేసిన భర్త

పొద్దున్నే ఐదున్నరకి లేవాలి. వీధీ, దొడ్డీ తుడిచి, నీళ్ళుజల్లాలి. నిన్నటి వంటకువాడిన రాసెడు అంట్లూ తోమాలి. పశువులపాక సాఫుచేసి రెండుబర్రెల పాలూ పితకాలి. ఇంటిల్లిపాదికీ లేచేటప్పటికి పళ్ళుతోముకునేందుకు నీళ్ళుతోడాలి.

ఏడింటికి అందరికీ కాఫీ సిద్ధంచెయ్యాలి. తను మాత్రం తాగకూడదు. ఎందుకంటే మామగారి మేనత్త కాఫీతాగినవాళ్ళ చేతి మీదుగా అన్నంతినదు ఎనిమిదింటికి మడికట్టుకొని పదింటిలోపల పదిమందికీ వంటచెయ్యాలి. లేకపోతే భర్త స్నానాలకి వేడినీళ్ళు సప్లై చెయ్యాలి. మధ్యలో ఆడబడుచు లెవరన్నా కాఫీలకి ఆర్డర్లిస్తే, ఆ పురమాయింపులన్నీ ఆచరించాలి. మడిమాత్రం చెడకూడదు. వేళకి మరదిని కాలేజీకి, భర్తను కోర్టుకు పంపాలి.

మామగారు పదకొండున్నరకు గాని తినడు. ఆయన తినందే ఆడవాళ్ళెవరూ విస్తరివేసుకోకూడదు. అందరూ తింటేగాని తను తినలేదు.

మళ్ళా భర్తకు రెండుగంటలకు టిఫినూ, మూడు గంటలకు అందరికీ 'టీ' ఇవన్నీ అయ్యేటప్పటికి రాత్రివంట రాత్రిపని ముగిసేటప్పటికి పది అవుతుంది. అందరికీ పక్కలు అమర్చి తర్వాత తను నిద్రపోవాలి.

కాపరానికి వొచ్చినప్పట్నించీ సూక్ష్మంగా చంద్రకాంత దినచర్య ఇది లోంకలో బానిసత్వం తొలగిపోయిందనే అపభ్రమలో ఎవరన్నా వుంటే చంద్రకాంతవంటి వాళ్ళను ఎంతోమందిని చూపగలను – "తిరగబడక ఈ శతాబ్దంలో కూడా అదే కర్మ" అంటే చెప్పలేను.

ఇంతయినా ఆ ఇంట్లో ఒకళ్ళకీ చంద్రకాంతంమీద ప్రేమ, సానుభూతి అనేవిలేవు. రుచులు కుదరలేదనో, పెరుగు పులిసిందనో, నీళ్ళు మరగలేదనో ఈసడింపులూ, సాధింపులూ.

విధవాడబడుచుకి వేరేపనే లేదు – తినికూచుని 'ఆడబడుచు అర్ధమొగుడు' అంటూ దీర్ఘాలుతీస్తూ, చంద్రకాంతని కోసిపెట్టడంతప్ప.

చంద్రకాంతతండ్రి గౌరవకుటుంబీకుడు. కుటుంబరావు. పేరుకు తగినట్టే కుటుంబంకూడా పెద్దదే; నలుగురు మొగపిల్లలూ, ఆరుగురు ఆడపిల్లలూ, అందులో ఆఖరామె చంద్రకాంత తరతరాలు ఊరికేకూచుని తినడంవల్లా, ఆరు పెళ్ళిళ్ళు అమోఘంగా

చెయ్యడంవల్లా కుటుంబంపరిస్థితి ఆర్థికంగా చితికిపోయినా, గౌరవప్రతిష్ఠలవిషయంలో వేలెత్తి చూపలేరెవరూ.

ఆఖరిబిడ్డ చంద్రకాంత ఎంతో గారాబంగా పెరిగింది. చంద్రకాంత సుఖపడదని ఎవరూ అనుకోలేదు; ఆ భయమే కలగలేదు.

చంద్రకాంతభర్త సర్వేశ్వర్రావు, ప్లీడరీ చేస్తున్నా భారమంతా సర్వేశ్వరుడిమీదా, పెత్తనమంతా తండ్రికీ, అక్కగారికీ వొదిలి, నాలుగు రాళ్ళు తెచ్చి ఇంట్లో పడెయ్యడమే ఆశయంగాగల సాత్వికమహాశయుడు.

తండ్రీ, విధవక్కగారూ, పెళ్ళికాని చెల్లెలూ, కాలేజీలో చదివే తమ్ముడూ, తండ్రి మేనత్తా – అందర్నీ అతనే పోషించాలి.

చంద్రకాంత దినచర్య చెప్పడంలో నా వుద్దేశం ఆవిడ కష్టాలన్నీ ఏకరువుపెట్టి మీ సానుభూతిని పొందేలా చేద్దామని కాదు.

అంతకంటె ఎక్కువగా కష్టపడేవాళ్ళుకూడా వుంటారు ఐనా ఏమాత్రం సౌఖ్యపుఛాయల దరిదాపులకైనా చంద్రకాంతలా చేరనివాళ్ళు అరుదుగా వుంటారనుకుంటాను. భర్తప్రేమని పొందగలిగినట్టయితే చంద్రకాంత అంతకంటె రెట్టింపు కష్టాన్ని భరించగలిగేది. సర్వేశ్వర్రావు స్వభావాన్ని చిత్రించడం కష్టం. ఈ క్రింది సంఘటన విన్నాక ఏమనుకోవాలో నాకే తెలీలేదు.

సర్వేశ్వర్రావు ఏడున్నరగంటలకు భోజనం చేసి మామూలుగా క్లబ్‌కి పోతాడు. రాత్రి పదైతే గాని రాడు. అందులో ఆడేది 'కాంట్రాక్ట్ బ్రిడ్జి' ఒక్కోరోజు రాత్రి రెండు గంటలు కూడా అయ్యేది.

చంద్రకాంత పనులన్నీ పూర్తయ్యాక తనగదిలోకి పోయి, భర్తకోసం నిరీక్షించి, నిరీక్షించి నిద్రపోయేది.

ఆ రోజున తలుపుతట్టినట్టయింది. వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా మామగారు! చిరునవ్వుతో "ఏమే కోడలా, ఏం చేస్తున్నావ్?" అన్నాడు.

చంద్రకాంతప్రాణం పైకెగిరిపోయినట్టయింది హడలి పోయింది వెంటనే తలుపులు బిగించుకుంది. గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. కాళ్ళు వణకసాగాయి. భయంతో క్రుంగిపోయింది.

మామగారి విషపుదగ్గు, సకలింపూ వినబడ్డాయి... జారీ చెయ్యసాగింది: "తండ్రి నీళ్ళు పోసుకున్నంతసేపూ, అన్ని చేదలూ నీళ్ళు చేదాలని" "మామగారంటే దైవసమానుడు. అల్లాంటివాళ్ళకు ఏ సేవైనా చెయ్యాలి" అని బోధచేసింది.

"మీ నాన్నగారుకదా; నువ్వు మాత్రం సేవ చెయ్యకూడదా" అందామనుకుందో, అందో చంద్రకాంత; నరరూపరాక్షసిలాంటి ఆ యిల్లుబట్టిన విధవాడబడుచు, మీద విరుచుకుబడింది: "నాకే ఎదురు చెబుతావుటే? ఆ మాత్రం మామగారికి సపర్య చెయ్యకూడదూ?– పత్తిత్తువు బయలు దేరావని. చూడండి ఎంత పొగరో? శతకోటి జంగాల్లో బోడిజంగమని, అక్కడికి

తానొక్కత్తే పతివ్రతాశిరోమణి ఐనట్టు" అంటూ, ఇంటిపెంకులు ఎగిరిపోసాగాయి.

మనదేశంలో మధ్యతరగతి కుటుంబాల్లో వితంతువులు చేసే అఘాయిత్యాలు ఇంతా అంతా కాదు! ప్రతి ఇంట్లోనూ వాళ్ళమూలంగా ఎంత గోల జరుగుతుంది. ఈ మాటలు రాసేది స్త్రీ జాతినీ, వితంతువుల్నీ కించపర్చాలని కాదు. వాస్తవ విషయమంతే!

అయితే అలా ఎందుకు జరుగుతుందీ అంటే కారణం. లేకపోలేదు. మానవులకు సహజమైన జీవితం నుండీ వాళ్ళు బలవంతంగా వేరుచేయబడతారు. దానిక్కారణం,మతం, పురాతనాచారాలు మొదలైనవి. సహజప్రవృత్తుల్ని అణగద్రొక్కుకున్నప్పుడు వాటిని మంచిమార్గాల్లోకి 'సబ్లిమేట్' చెయ్యకపోతే, ఇలాంటి విషమపరిణామాలకు దారితీస్తాయి.

ఎన్ని కష్టాలన్నా భరించింది గాని, ఈ బాధని చంద్రకాంత సహించలేకపోయింది.

రాత్రి భర్త కాళ్ళమీదపడి, ఏడ్చి, విషయమంతా పూసగ్రుచ్చినట్టు చెప్పింది.

"ఐతే నన్నేం చెయ్యమంటావ్? నీకోసం మా వాళ్ళతో తగవులాట ఎక్కడ పెంచుకోను? ఏదో నీ చాకచక్యంతో నువ్వే సర్దుకుపోవాలి. అయినా ఎప్పుడూ ఆడవాళ్ళమానాన్ని రక్షిస్తూ కూచోడమేనా మా పని? ఎవరి మానం వాళ్ళు కాపాడుకోవాలంతే!" అని కసిరాడు.

చంద్రకాంత కన్నీటితో తడిచిన తలగడాలో తన గుండెల్ని దాచుకుంది.

వారంరోజుల పనిమీద సర్వేశ్వర్రావు బొంబాయి వెళ్ళడంతో కథ క్లయిమాక్స్ అందుకుంది.

ఆ వారంరోజుల్లోనే తండ్రీ కూతురూ, చంద్రకాంత మీద కసితీర్చుకున్నారు. ఒక నాటి రాత్రి ఆ యింట్లో బిగ్గరగా ఏడుపులూ, పెడబొబ్బలూ, పిడిగ్రుద్దులూ వినపడ్డాయి ఇరుగుపొరుగువారికి. మరునాడు పొద్దున్నే వాళ్ళకి నీళ్లూ, కాఫీ సిద్ధమవలేదు. వీధికూడా శుభ్రంకాలేదు.

ఇంకా లేవలేదనుకుని చంద్రకాంత గదిలోకి వెళ్లారు ఆమె అక్కడ లేదు.

ఇంటిల్లి పాదీలేచి ఇల్లూ, దొడ్డీ, బావీ వెతికారు. కాని కనబడలేదు.

చివరికి ఊరిబయట చెర్లో దొరికింది – చంద్రకాంత శవం.

ఆ దృశ్యాన్ని ఇప్పటికీ మరువలేను. నిర్మలమైన ఆమె మొహంమీద ముత్యాల్లా మెరిసే నీటిబిందువులూ, నల్లని ముంగురులూ, వాడని ఆ తేజస్సు, వీడని చంద్రబింబంవంటి కాంతీని...

తర్వాతకథ ఊహించుకోలేంత కష్టమైందికాదు. మీకైనా.

శవపంచాయతీలో, "ప్రమాదవశాత్తు మరణం పొందిన"దని తేలింది. అది ఎంతవరకూ నిజమోకాని,

"మావంశానికి తీరని కళంకం తెచ్చింది, పాతకి" అని ఆ కుటుంబీకులు ఇప్పటికీ, ఎప్పటికీ, ప్రచారం చెయ్యడం మాత్రం నిజం!